**మా మేడమీది వంట ఇంటి కిటికీలోంచి చూస్తే ఆకాశంలో కొద్ది భాగం మాత్రమే కనిపిస్తుంది.**

**అలాగే ఈ మహా పట్నంలోని ఎన్నో మేడల్లో కొన్ని మాత్రమే కనిపిస్తాయి.**

**నేను చూసిన మేరకే ఆకాశ మున్నదనుకున్నట్టుగానే కిటికీలోంచి నేను చూసినదే జీవితమనుకున్నాను. నిజమే, పొరపాటుపడ్డాను.**

# వంట ఇంటి కిటికీ

## బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

నా చూపుకే పరిమితి కాని, జీవితానికి కాదని తరవాత తెలిసింది. పిల్లలతో ఇంటి పట్టున వుండేదాన్ని కొబట్టి లోకాన్ని పరిశీలించే అవకాశం నాకు లేదు. నా లోకానుభవమంతా ఈ కిటికీ ద్వారా సంపాదించినదే. కాని చివరికి ఏ గ్రంథాలూ, ఏ అనుభవాలూ సమకూర్చలేని ఒక నిజాన్ని అది నాకు చెప్పింది.

పిల్లలిద్దరూ స్కూలుకు వెళ్ళేక ఆయన ఆఫీసుకు వెళ్ళేక నేను వంటింట్లో పనులు తెముల్చుకుని కిటికీదగ్గర నిలుచున్నాను. బాగా ఎండెక్కింది. చుట్టూవున్న మేడల మీద ఎండ పడి గోడల కేసిన రంగులు నిగనిగలాడేయి. చిన్నప్పుడు ఆటలో ఖాళీ అగ్గిపెట్టెలు ఒకదానిమీదొకటి పేర్చినట్టుగా వున్నాయీ మేడలు. అందులో కుడి ప్రక్క, ఎడంప్రక్క వున్న రెండు మేడలు నా దృష్టికి అందుబాటులో వున్నాయి. వాటి కిటికీలు విశాలమైనవి. ఆ కిటికీల్లోంచి ఆ ఇళ్ళలోని సంసారాలు కనిపించేవి. అవి భాగ్యవంతుల కుటుంబాలని—అందుకు చిహ్నాలుగా రేడియోగ్రాములు, టీవీలు, ఫ్రిజ్‌లు వున్నాయి. వాటిలోని మనుషులు ఖరీదైన బట్టలు కట్టుకునేవారు. ఎప్పుడూ నవ్వుతూ హుషారుగా వుండేవారు.

కుడిప్రక్క మేడలోని పురుషుడు మంచి దుస్తులేసుకుని ఆఫీసుకు బయలుదేరినట్టున్నాడు. అతని భార్య గదిలోనే కూర్చుని వుంది. ఆమె అప్పుడే నిద్రలేచి నట్టుంది. పగలు పదిగంటలవరకూ నిద్రపోతూందా? చిత్రంగానేవుంది. ఇంకొక ఆడమనిషి మాపిన చీర కట్టుకుని వచ్చింది. బ్రీఫ్‌కేస్ తెచ్చి అతనికి అందించింది.

అతను గదిలోకి తొంగిచూసి కుర్చీలో కూర్చున్న భార్యను పిలిచి వెళ్తున్నానని చెప్పినట్టున్నాడు. ఆమె పేరు సుశీల అయి వుండవచ్చును. అతను ఏమని పిలిచాడో నాకు వినబడలేదు కాని "సుశీ" అని ముద్దుగా పిలిచి వుంటాడు. సుశీ నవ్వుతూ టాటా చెబుతున్నట్టు చెయ్యి ఊపింది.

సుశీ ఫ్రిజిడియర్ తలుపుతీసి అందులోంచి ఒక సీసా బయటికి తీసింది. అందులోని పదార్థం గ్లాసులో వేసుకుని తాగింది. ఏ మందో, మాకో అయివుండాలి. ఆవిడ్ని చూస్తే అనారోగ్యంగానే వున్నట్టుంది. అంత భాగ్యవంతురాలికి జబ్బేమిటో కర్మ! వాళ్ళ వీధి వరండాలో మాపిన చీరావిడ బహుశా వంటమనిషి కావచ్చు, చాపమీద కూర్చుని పత్రిక చదువుకుంటూంది. చదువొచ్చిన వంటలక్క సీరియల్ నవలలు చదవక మానేస్తుందా?

ఎడంప్రక్క మేడలో మగవాడు కూడా ఏదో పనిమీద వెళ్తున్నట్టున్నాడు, అతని భార్య గుమ్మం వరకూ వచ్చి అతనితో ఏదో చెప్పింది. బహుశా వేగం ఇంటికి రండి అని చెప్పి వుంటుంది. అతను వెళ్ళగానే తలుపు గడివేసుకుంది. గదిలో అటూ, ఇటూ తిరిగి పెట్టె తెరచి ఒక్కొక్క నగ తీసి చూసుకొని మెడలో వేసుకుంది. అబ్బ ఎన్ని నగలు; మెడ నిండిపోయింది. చేతిలో అద్దం పట్టుకుని కిటికీ వరకూ వచ్చి వెలుగులో తన మెడ చూసుకుంది. వెలుగుపడి నగలు నిగనిగలాడేయి. తన ఐశ్వర్యం అద్దంలో చూసుకుని ఆనందంతో ఉప్పొంగిపోతూ వుంటుంది. ఎవరికేనా అంతేగదా. ఐశ్వర్యం ఆనందం యివ్వలేకపోతే ఇంకే దివ్వగలదు? ఆమె మళ్ళీ నగలన్నీ తీసి పెట్టెలో పెట్టింది. మళ్ళీ తోసి మెడతోనే వుంది. ఎవరూ లేనప్పుడు నగలెందుకు పెట్టుకుంది? ఎప్పుడూ తోసిమెడతో ఎందు కుంటుంది? దిష్టి తగులుతుందనా? ఆమె నగలు నా కంటబడ్డాయి. నా దిష్టి తగలదు కదా.

సాయంకాలం నేను వంటఇంట్లోకి వెళ్ళి అప్రయత్నంగా కిటికీలోంచి చూశాను. కుడి ప్రక్క మేడమీది గదిలో ట్యూబు లైటు వెలుగులో భార్యా భర్త లిద్దరూ చక్కగా ముస్తాబై సరసాలాడుకుంటున్నారు. పొద్దున్న అనారోగ్యంగావున్న సాయంత్రానికల్లా ఆవిడకు చాల హుషారొచ్చినట్టుంది. కిలకిల నవ్వుతూంది. తరవాత ఇద్దరూ మేడదిగి కారెక్కి వెళ్ళిపోయారు. ఏ బీచికో, సినిమాకో వెళ్తుంటారు. అదృష్టవంతులు. అలా వుండాలి జీవితం. అటు హాయిగా నీటిలో ఈత కొడుతూ, ఇటు గాలిలో విలాసంగా ఎగిరే నీటి కొకుల్లాగా బతుకు చీకూ చింతా లేకుండా గడచిపోవాలి. నా కా అదృష్టంలేదు. ఏ సుఖమూ లేకుండానే తనకీ వంట ఇంట్లో రోజులు గడిచిపోతున్నాయి. తన భర్త తెచ్చే జీతం జరుగు



బాటుకు సరిపోతుంది కాని విలాసాలకూ, వినోదాలకూ చాలదు. అందుకే కాబోలు ఎవరికెంత ప్రాప్తముంటే అంతే నన్నారు మన వాళ్లు. మనిషి తన కందని సుఖాల నాశించకుండా ఎక్కడికక్కడ సంతృప్తి పడడానికి చెప్పిన వేదాంత మది.

ఆ భార్యా భర్తలు వెళ్ళేక వంట మనిషి లోపలికొచ్చి సామాన్లూ పక్కాలూ సర్ది తల దువ్వుకుని పువ్వులు పెట్టుకుంది. చీర మార్చింది. అద్దంలో తన రూపం చూసు కుంది. రూపురేఖలు బాగానే వున్నాయిగాని, ఆ సింగార మెందుకో అర్థంకాదు. ఇదేదో చెడిపోయిన మనిషిలా వుంది. దాని మొహం చూస్తే వెగటు కలిగింది. ఇలాంటివాళ్ళు ఎన్ని తిరుగుళ్లయినా తిరుగుతారు. ఇంతలో అది కిటికీ తలుపు మూసేసింది. ఇంట్లోనే వ్యవహారం సాగిస్తుంది కాబోలు. ఛీ! పాడు మనిషి!

ఎడంప్రక్క మేడలో నగలావిడ బోసి మెడతో మొగుడికోసం ఎదురు చూస్తున్న ట్టుంది. పిల్లలు లేరుకాబోలు. మొగుడు పనిలోకిపోయి ఆలస్యంగా వస్తాడు. ఇంట్లో ఎలా తోస్తుంది మరి. పత్రికలు కూడా చదువుతున్నట్టు లేదు. అసలు చదు వొచ్చునో రాదో? అంత భాగ్యవంతులకి చదువు రాకుండా వుంటుందా? వచ్చే వుంటుంది. ఆవిడ లైటార్పేసింది, పోయి పడుకుంది కాబోలు.

ఆ రాత్రి మా ఆయనతో నేను కిటికీ లోంచి చూసిన విశేషాలు చెప్పేను. ఆయన అంతా విని "వండర్ ఫుల్" అన్నారు.

"ఏమిటి వండ్రఫుల్?"

# పోగులు

పెళ్ళిలో పెట్టారు విలువైన పోగులు
పెదవిపై వెన్నెలలు విరిసింది నాగులు
చెవిపోగులకు కన్ను చెదరిపోయింది
కన్ను మెరపున మేల్మిపన్నె తరిగింది

మెడను పుస్తెల గొలుసు మెరసె ఆనాడు
పై పూత పస బైటపడిన దొకనాడు
మెరుగు బంగారుకల పురుగు తోచింది
పూత మెలిమినాడు పుచ్చె కాచింది.

కాలము కర్మము కలసిరానపుడు
గొప్పవారూ మాట తప్పిపోతారు
చెలిమి చేరిక వలపు కలిమి యెదనిండె
పోగులంటే ముద్దు మురిపెములు పండె

చిరుపొట్ట పరిమళ్ళు ఎరుపుకై చూచె
వేవిళ్ళ చిరుతిళ్ళకై వెలది వాచె
ఇంటి వెచ్చము ధరలు మింటికంటినవి
కడుపు కాలిన సెగలు గుడిసెలంటినవి

పద్దు బాకీ యింక వల్ల కాదనె సెట్టి
ఎగవేతలెన్నెన్నొ ఏకరువుపెట్టి
పదును మీదే మదుపు ఫలితముంటుంది
అదను తప్పినదెల్ల వ్యర్థమౌతుంది

రేడియో మోతలను రేబవలు విన్నా
అప్పుపెట్టే బాంకు అదనులో సున్న

ఉరుకుపరుగులతోడ అరిగె సరికాళ్ళు
కరువు యెద్దడియప్పు కాలిసంకెళ్ళు

కాపు పచ్చనిపైరు కలయచూచాడు
తలపుతీరుల మదుపుకలలు మలిచాడు
గుండె మెదలెను పులుపు కోరికల నాగులు
అదరుమదిలో కదలె ఆలి చెవిపోగులు

చెవులయందము పరువు చెక్కిళ్ళ నగవు
పోగులొకచే జంటపొందికల బిగువు
పైపంట చూపుతో కాపు తలయొగ్గె
తన కడుపు పంటకై తరుణి చెవియొగ్గె

అత్తవారింటనే అమరినవి పోగులు
అత్తింటికే తిరిగి అంపినవి నాగులు
మురుగు పంటముక్కె తొలిసాలు
తరుగుపాసల నగము దక్కె మలిసాలు



కరువు దినములయందె కడుపు పండినది
కన్నీటితో కన్నకడుపు నిండినది
పైపంటయప్పు లాపైపంట చూచె
ఏ దిక్కుచూచినా వేదనలె వీచె

పోగులుంచేతావు పూడిపోయింది
ముద్దుముచ్చట యింటిమూగపోయింది
జరిగిపోయినరోజె సరియైనదేమొ!
రేపు పేదకు పగటి తీపికలయేమో!!!

—మల్లాది శివరాం

---

"నీకు మంచి పరిశీలనాశక్తి, ఊహాశక్తి వున్నాయి. ఇక నువ్వు కథలు రాయొచ్చు."

"నేను కథలు రాయడమేమిటి? నా తల కాయ."

"కాదు, నీలాంటివాళ్ళే రాయాలి, నీకు కాలక్షేపం కూడా అవుతుంది" అన్నా రాయన.

"అంటే వాళ్ళలా మనం బీచికీ, పిసీ మాలకీ వెళ్ళక్కర లేకుండానా?"

"వెళ్ళొచ్చు. కానీ, ఆనందాన్ని వెదుక్కుంటూ బీచి వరకూ వెళ్ళాలా? ప్రయోజనకరమైన పనిచేస్తే కలిగే తృప్తీ, ఆనందం బీచిలో ఎక్కడొస్తుంది. నువ్వొక మంచి కథ రాశావనుకో, అది అచ్చయి అందరూ మెచ్చుకున్నారనుకో. అప్పుడు నీ కెంత ఆనందంగా వుంటుందో వూహించుకో."

"ఏం కథ రాయమంటారు."

"నువ్వు కిటికీలోంచి చూ సే దంతా ఒకటికాదు, చాలా కథలు రాయొచ్చు."

"అంటే ఏమిటి రాయాలంటారు?"

"నువ్వు కొన్ని విషయాలు చూశావు, కొన్ని ఊహించావు. నీ ఊహలు తప్పో, సరియైనవో పరిశీలించు. ఆవిడ నగలెందుకు పెట్టుకుంది? ఎందుకు తీసేసింది. ఇంకో ఆవిడ ఉదయం అనారోగ్యంగా వున్నది, సాయంకాలానికి హుషారుగా ఎలా తయారైంది? వంటలక్క ఎందుకు సింగారించుకుంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకొచ్చు. దొరక్కపోతే ఊహించి రాయి. ఇలా కొన్ని కథలు రాసి అన్నీ కలిపి "కిటికీ కథలు" అని సంపుటిగా అచ్చువేద్దువుగాని "అన్నారాయననవ్వుతూ.

"బాగుంది, మీ సలహా."

"అవును మరి వాళ్ళేదో అదృష్టవంత లనీ, మనమేదో దురదృష్టవంతులమనీ

బాధపడడం కంటె ఇది నయమేకదా?"

"బాధపడడం సహజమే క...?"

"బాధపడుతూ కూర్చోవడం చాతకాని వాళ్ళ పని. బాధలు తొలగించు కోవడం అందరికీ సాధ్యమయేది కాదు. కాని, చేతనయిన వాళ్ళు మనసు బాధపడకుండా మళ్ళించుకుంటారు ఇలాంటి పనులు చేసి."

"సరే రాస్తాను" అన్నాను.

రెండు రోజుల పాటు నాకు విశేషమే కనిపించలేదు. కాని రెండు రోజుల తరవాత రాత్రి వంటింట్లో పనులు పూర్తిచేసుకుని కిటిక దగ్గర నిలబడ్డాను.

కుడిప్రక్క మేడలో కిటికీ తీసి వుంది. వంటమనిషి మాత్రమే వుంది. మంచి చీర కట్టి జడలో పూలు పెట్టుకుని సింగారించుకుని వుంది. అంతలో అతనొచ్చాడు. కొద్ది సేపు వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకున్నారు. తరవాత అతను ఆమెను దగ్గరగా తీసుకున్నాడు. ఛీ! ఎంత నీచం! ఇంతకీ ఇంటావిడ ఏమయింది? వాళ్ళు కిటికీ మూసేశారు. ఏమిటీ పాడులోకం అనుకున్నాను. నిన్నటివరకూ ఎంతో ముచ్చటగా కనిపించిన సంసారం, ఇవాళ వికారంగా తయారయిందేమిటి?

ఎడంపక్క మేడలో కిటికీ తెరిచేవుంది. ఆవిడ కుర్చీలో కూర్చుని వుంది. అతను తలుపు తడితే ఆమె లేచి తలుపు తీసింది. అతను సరిగ్గాలేచి నిలబడలేకపోతున్నాడు. కుర్చీలో కూర్చుండిపోయాడు. వాళ్ళిద్దరూ వాదించుకుంటున్నట్టుగా వుంది. తరువాత ఆమె పెట్టెలోంచి ఒక నగ తీసియిచ్చింది. అతను తీసుకున్నాడు. అంతలో మళ్ళీ అతను హఠాత్తుగా లేచి ఆవిడ జుట్టు పట్టుకుని, తల వంచి గట్టిగా నాలుగు తన్నులు తన్నేడు ఆమె అతని పట్టు విడిపించుకోడానికి పెనుగులాడింది. అతను మరో దెబ్బ వేసి వదిలేశాడు. ఆమె ఏడుస్తూ వుండాలి. కళ్ళు తుడుచుకుంది. మళ్ళీ అతనేదో చేతు లూపుతూ బెదిరిస్తున్నట్టున్నాడు. తరవాత గబగబా బయటికెళ్ళేడు. ఛీ! ఎంత దుర్మార్గుడు! తాగుబోతు వెధవ! పెళ్ళాన్ని కొట్టే నీచుడు! ఆమె ఏడుస్తూ కూచుంది. ఆ నగ ఎందుకు పట్టుకుపోయాడో నా కర్థం కాలేదు.

అంతలో అకస్మాత్తుగా నా వెనక గట్టిగా నవ్వడం వినిపించి తృళ్ళిపడి వెనక్కి తిరిగేను. మావారు చడీచప్పుడూ లేకుండా వంటింట్లోకి వచ్చి ఎంత సేపయిందో నేను చూసుకోలేదు.

"అబ్బ! మీరా భయపడి చచ్చాను" అన్నాను.

"నీతోపాటు నేనూ కొంత పరిశీలించాను. కథకు పనికివచ్చే ఇతివృత్తం దొరికింది" అన్నారాయన.

"కుడిపక్క మేడలో ఆ దరిద్రుడు వంటావిడతో సరసమాడుతున్నాడు. కథ రాసేందుకేముంది, నా తలకాయ."

"ఎందుకులేదు. నువ్వు పొరపడి వుంటావు. వంటావిడే భార్య ఆవిడ శీలం మంచిది కాదనుకున్నావు. కాని శీలవతే. నువ్వు భార్య అనుకున్నది ఉంపుడుగత్తె.

"మరి అదేమయింది?"

"ఇంట్లో వున్న డబ్బూ నగానట్రా పట్టుకుపోయుంటుంది. డబ్బూ దస్కం పోయేసరికి వాడికి బుద్ధి వచ్చుంటుంది."

"ఎడం పక్క మేడలో అతను తాగుబోతు అయుండాలి కదా" అన్నాను.

"తాగుబోతేకాదు. జూదగాడు కూడా అయుండాలి. అందుకే భార్య నగలు అడిగుంటాడు."

"అడిగితే ఇచ్చిందికదా, మరెందుకు కొట్టేడు."

"ఆమె దగ్గర రెండు సెట్ల నగలుండి వుండాలి. ఒకటి బంగారంవి. రెండో సెట్టు గిల్టువి. అదివరకు అతను నగ అడిగినప్పుడు గిల్టు నగలు తీసి యిచ్చివుంటుంది. అది అతనికి తెలిసి తన్నుంటాడు. నిజం నగలు రహస్యంగా దాచివుంటుంది. భర్త యింట్లో లేనప్పుడు పెట్టుకుని కొంతసేపు తృప్తిగా అద్దంలో చూసుకుని మళ్ళీ దాచేస్తూవుంటుంది" అన్నారాయన.

"మీరు నిజంగా కథకులు. ఎంతో చక్కగా వూహించారు."

"కాని కథ నువ్వే రాయి. నీకనుభవముందిగా. కథలో నువ్వు చెప్పదలచుకున్నది కూడా స్పష్టంగానే అర్థమయింది కదా."

"అయింది. ఎండమావులు నీటి సరస్సులు కానట్టుగానే మన కంటికి కనిపించేది నిజం కాదని ఈ కిటికీ నాకు చెప్పింది."

"నిజమే లక్ష్మి. వాళ్ళు అదృష్టవంతులనీ మనం దురదృష్టవంతులమనీ అనుకున్నావు. వాళ్ళు సుఖపడుతున్నట్టు కనిపిస్తారు. కాని వాళ్ళు సుఖపడడంలేదు. సుఖపడుతున్నామని భ్రమపడుతున్నారు- మనల్ని భ్రమింపజేస్తున్నారు. మనం అలా కృత్రిమంగా బతకడంలేదు. ఇప్పుడు చెప్పు ఎవరు అదృష్టవంతులో."

"మనమే. మనకలాంటి సుఖం అక్కరలేదు" అన్నాను.

ఆయన నవ్వి నా భుజంమీద చెయ్యి వేశారు.

"చెయ్యి తియ్యండి, ఆ మేడలమీద వాళ్ళు కిటికీల్లోంచి చూస్తారు" అంటూ కిటికీ తలుపులు మూసేశాను. ★

